27న విద్యాశాఖా మంత్రి బొత్స పర్యటన

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర విద్యా శాఖ మంత్రి బొత్స సత్యనారాయణ సోమవారం జిల్లాలో పర్యటించనున్నారు. 27న ఉదయం 11 గంటలకు రాజాం నియోజకవర్గ పరిధిలో వంగర మండల కేంద్రంలో తహశీల్దారు కార్యాలయ భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం వైఎస్ఆర్ ఆసరా ఆర్థిక సహాయం అందించే కార్యక్రమంలో పాల్గొంటారు. మధ్యాహ్నం 3 గంటలకు గుర్ల మండలం గూడెంలో పిఎసిఎస్ భవనాన్ని ప్రారంభిస్తారు. అనంతరం గుర్ల మండల స్థాయిలో ఆసరా ఆర్థిక సహాయం పంపిణి కార్యక్రమంలో పాల్గొంటారు. 28, 29 తేదీల్లో విశాఖలో జరిగే జి20 సదస్సుకు హాజరవుతారు.

ఆత్మవిశ్వాసంతో పరీక్షలకు సిద్ధం కండి

పదోతరగతి విద్యార్థుల అవగాహనా సదస్సులో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విద్యార్థులు సంపూర్ణ ఆత్మవిశ్వాసంతో పదోతరగతి పరీక్షలకు సిద్ధం కావాలని డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి పిలుపునిచ్చారు. రాష్ట్ర ఉజ్వల భవిష్యత్తు కోసం ప్రభుత్వం విద్యకు ఎనలేని ప్రాధాన్యత ఇస్తోందని చెప్పారు. పదోతరగతి విద్యార్థులకు పబ్లిక్ పరీక్షలు రాయడంపై మున్సిపల్ కార్పొరేషన్ ఆధ్వర్యంలో స్థానికంగా ఒక ఫంక్షన్ హాలులో శనివారం అవగాహనా సదస్సును నిర్వహించారు. కార్యక్రమంలో డిప్యూటీ స్పీకర్ కోలగట్ల మాట్లాడుతూ రాష్ట్రప్రభుత్వం విద్యకు, వైద్యానికి అత్యధిక ప్రాధాన్యత ఇస్తోందన్నారు. చక్కని విద్యను అందించడంతోపాటు, మంచి పోషక విలువలతో కూడిన రుచికరమైన భోజనాన్ని కూడా ప్రభుత్వం అందజేస్తోందని చెప్పారు. కంటివెలుగు కార్యక్రమం ద్వారా కళ్ల పరీక్షలు నిర్వహిస్తున్నామని చెప్పారు. విద్యార్థులు కష్టపడి చదివి, తమపై తల్లితండ్రులు, గురువులు ఉంచిన నమ్మకాన్ని నిలబెట్టుకోవాలని కోరారు.

జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి మాట్లాడుతూ, కాలం విలువను తెలుసుకోవడం విజయానికి మేలైన మార్గమని పేర్కొన్నారు. దీనిని గుర్తించగలిగితే, సగం విజయాన్ని సాధించినట్టేనని అన్నారు. ప్రతీ విద్యార్థి ఒక లక్ష్యాన్ని నిర్ధేశించుకొని, దానిని సాధించేందుకు కృషి చేయాలని కోరారు. ముఖ్యంగా ఏకాగ్రతను అలవర్చుకోవాలని సూచించారు. విద్యార్థులు ఇతర అంశాలకంటే చదువుకే ఎక్కువ విలువనివ్వాలని అన్నారు. కష్టాలకు, వైఫల్యాలకు కృంగిపోకుండా, ఆత్మహత్యల జోలికి వెళ్లకుండా, విశ్వాసంతో ముందుకు సాగాలని కోరారు. బాలికలు కూడా చిన్నవయసులోనే పెళ్లి జోలికి పోకుండా కనీసం డిగ్రీవరకు చదువుకొని, ముందుగా తమ కాళ్లమీద తాము నిలబడేందుకు కృషి చేయాలని కలెక్టర్ కోరారు. మేయర్ వెంపడాపు విజయలక్ష్మి మాట్లాడుతూ పరీక్షల్లో ఉత్తీర్ణత సాధించడం ద్వారా తల్లితండ్రుల నమ్మకాన్ని నిలబెట్టాలని సూచించారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి మాట్లాడుతూ, విద్యార్థులు చదువుకొనే వయసులో కష్టపడితే, జీవితంలో సుఖఃపడతారని అన్నారు. ఈ పదోతరగతి పరీక్షల్లో జిల్లాలో అత్యధిక మార్కులు సాధించిన విద్యార్థికి రూ.25వేలు, రెండో విద్యార్ధికి రూ.15వేలు, మూడో విద్యార్థికి రూ.10వేలు నగదు బహుమానాన్ని ఇస్తానని ప్రకటించారు. సదస్సులో జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి, ఉప విద్యాశాఖాధికారి కె.వాసుదేవరావు, డైట్ ప్రిన్సిపాల్ డాక్టర్ ఎం.తిరుపతినాయుడు, విద్యాకమిటీ సభ్యులు తదితరులు పాల్గన్నారు.

అవగాహన సదస్సులో మాట్లాడుతున్న డిప్యూటీ స్పీకర్ కోలగట్ల వీరభద్రస్వామి

పూర్తయిన పనులకు యుసిలు సమర్పించాలి

అభివృద్ధి పనులపై కలెక్టర్ సమీక్ష

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో ఎంపి నిధులతో చేపట్టిన పనులను సత్వరమే పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎ. సూర్య కుమారి తెలిపారు. ఇప్పటికే పూర్తి చేసిన పనులకు సంబంధించిన యుసిలు సమర్పించాలని ఆదేశించారు. శనివారం కలెక్టర్ ఛాంబర్ లో ఎంపి నిధుల పనుల పురోగతిపై శాఖల వారీగా ఇంజినీరింగ్ అధికారులతో సమీక్షించారు. పార్లమెంట్ సభ్యులు బెల్లాన చంద్ర శేఖర్ కోటాలో జిల్లాకు రూ 12.10 కోట్ల విలువైన 309 పనులు మంజూరయ్యాయని, అందులో 150 పనులు పూర్తయ్యాయని, 41 పనులు పురోగతిలో ఉన్నాయని తెలిపారు. ఇంకను 117 పనులు ప్రారంభం కావలసి ఉందని, వీటిని వెంటనే ప్రారంభించాలని తెలిపారు. పార్లమెంట్ సభ్యులు ఎంవివి సత్యనారాయణ కోటాలో 51 పనులు మంజూరు కాగా, ఒక్క పని మాత్రమే పూర్తి అయ్యిందని, 38 పురోగతి లో ఉండగా 12 ఇంకా ప్రారంభం కావలసి ఉందని అన్నారు. 16వ లోక్‌సభ పార్లమెంట్ సభ్యులు కె.హరిబాబు కోటాలో రూ. 5.37 కోట్ల విలువైన 448 పనులు మంజూరు కాగా 327 పనులు పూర్తయ్యాయని, 63 పురోగతి లో ఉన్నాయని, ఇంకా 58 పనులు ప్రారంభం కావలసి ఉందని అన్నారు. రాజ్యసభ సభ్యులు సుబ్బిరామిరెడ్డి కోటాలో 525 పనులు మంజూరు కాగా 366 పనులు పూర్తయ్యాయన్నారు. ప్రారంభం కాని పనులకు ప్రస్తుతం అవసరాలను గుర్తించి ప్రతిపాదనలను పంపాలని తెలిపారు. సమావేశంలో సిపిఒ బాలాజీ, పంచాయతీరాజ్ ఎస్‌ఇ గుప్తా, ఆర్‌డబ్లుఎస్ ఎస్‌ఇ ఉమా శంకర్, డిఇఒ లింగేశ్వర రెడ్డి, ఆర్అండ్‌బి, మున్సిపల్, ఇరిగేషన్, విద్యుత్ , దివ్యంగుల శాఖల ఇంజనీరింగ్ అధికారులు పాల్గొన్నారు.

మహిళా సంఘాలకు నమూనా చెక్కును అందజేస్తున్న జెడ్‌పి చైర్మన్, కలెక్టర్

మహిళలకు ఆర్థిక ఆసరా

రూ.251.30 కోట్ల ఆర్థిక సాయం విడుదల

ప్రజాశక్తి-విజయనగరం

మహిళలు ఆర్థికంగా, సామాజికంగా నిలదొక్కుకోవాలన్నదే ముఖ్యమంత్రి ధ్యేయమని జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు అన్నారు. మహిళా సంఘాల సభ్యులకు మూడో విడత వైఎస్ఆర్ ఆసరా నిధుల విడుదలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్ ఏలూరు జిల్లా దెందులూరులో శనివారం ప్రారంభించారు. వీడియో కాన్ఫరెన్సు ద్వారా కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎ.సూర్యకుమారి, జిల్లాపరిషత్ చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, నగర మేయర్ వెంపడాపు విజయలక్ష్మి, డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి తదితరులు పాల్గొన్నారు. అనంతరం జిల్లాలోని 36,463 స్వయం సహాయక సంఘాల్లోని 3,92,613మంది మహిళలకు రూ.251.30 కోట్ల మొత్తాన్ని మూడో విడత వైఎస్ఆర్ ఆసరా సహాయంగా అందజేశారు. ఉమ్మడి విజయనగరం జిల్లాలో 4.85 లక్షల మంది మహిళలకు రూ.275 కోట్ల మూడో విడత ఆసరా సహాయం అందిస్తున్నట్టు తెలిపారు.గత ప్రభుత్వం డ్వాక్రా మహిళలకు రుణమాఫీ చేస్తామని చెప్పి మోసం చేసిందని, ముఖ్యమంత్రి జగన్ ఇచ్చిన హామీని నెరవేరుస్తున్నారని అన్నారు. వైఎస్ఆర్ కంటి వెలుగు కార్యక్రమంలో భాగంగా పలువురు పాఠశాల విద్యార్థినులకు కంటి అద్దాలను జెడ్‌పి చైర్మన్, కలెక్టర్,మేయర్ అందజేశారు. కార్యక్రమం లో డిఆర్‌డిఎ పీడీ కల్యాణ్‌చక్రవర్తి, ఎపిడి సావిత్రి, మెప్మా పీడీ సుధాకర్, జిల్లా మహిళా సమాఖ్య అధ్యక్షురాలు వెంకటలక్ష్మి తదితరులు పాల్గొన్నారు.

బాడంగి : సమావేశంలో మాట్లాడుతున్న సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి సురేష్

5న కార్మిక - కర్షక ప్రదర్శనలో పాల్గొనండి

సిఐటియు పిలుపు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఇటీవల మోడీ ప్రభుత్వం ప్రవేశపెట్టిన బడ్జెట్ కార్మిక, రైతు, ప్రజా వ్యతిరేకంగానూ, ప్రైవేట్ కార్పొరేట్ పెట్టు బడిదారులకు అనుకూలంగాను ఉందని, ఇటువంటి ప్రజా వ్యతిరేక విధానాలకు బదులుగా ప్రజా అనుకూల విధానాల కోసం ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే కార్మిక కర్షక పోరాట ప్రదర్శనలో పాల్గొని విజయవంతం చేయాలని సిఐటియు జిల్లా ప్రధాన కార్యదర్శి కె.సురేష్ పిలుపునిచ్చారు. శనివారం ఎన్‌పిఆర్ భవనంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ఛలోఢిల్లీ పోస్టర్‌ను ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కేంద్రం లోని బిజెపి ప్రభుత్వం కార్మికులు, రైతులు, ప్రజల సమస్యలను మరింత జటిలం చేస్తోందని, వారి సమస్యలు పరిష్కరించకుండా అత్యంత ధనవంతులైన ఆదానీ, అంబానీ సేవలో మునిగి తేలుతోందని అన్నారు. కార్మికులను యజమానులకు బానిసలు చేసే విధంగా మోడీ ప్రభుత్వం కార్మిక చట్టాల్లో మార్పులు చేసి లేబర్ కోడ్‌లను పార్లమెంట్‌లో తన మంద బలంతో పాస్ చేసిందని అన్నారు. సమ్మె, యూనియన్, కనీస వేతనం, పని గంటలు, ఇపిఎఫ్, ఇఎస్ఐ తదితర కార్మిక హక్కులపై దాడి చేస్తోందన్నారు. చాలాకాలం నుండి కోరుతున్న కనీస వేతనం నెలకు రూ.26 వేలు, కనీస పెన్షన్ రూ 10 వేలు, కాంట్రాక్టు,ఔట్ సోర్సింగ్, టైమ్ స్కేల్, డైలీవేజ్, గౌరవ వేతన తదితర కోర్కెలను మోడీ ప్రభుత్వం పట్టించు కోవడం లేదన్నారు. గ్రామీణఉపాధి పథకానికి తూట్లు పొడుస్తూ బడ్జెట్లో కేటాయింపు లను రూ.30వేల కోట్లు కోత పెట్టిందన్నారు. ఇటువంటి ప్రజావ్యతిరేక ప్రభుత్వంపై పోరాడి ప్రజా అనుకూల విధానాల అమలు కోసం ఏప్రిల్ 5న ఢిల్లీలో జరిగే కార్మిక- కర్షక పోరాట ప్రదర్శనలో పాల్గొనాలని కోరారు. సమావేశంలో సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు యుఎస్. రవికుమార్, నగరకార్యదర్శిబి.రమణ పాల్గొన్నారు.

బాడంగి : మండల పరిషత్ కార్యాలయం ఆవరణలో స్కీం వర్కర్లతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐటియు జిల్లా అధక్ష ప్రధాన కార్యదర్శులు పి.శంకర్రావు, కె.సురేష్ మాట్లాడుతూ సమస్యల పరిష్కారానికి తలపెట్టిన చలో ఢిల్లీని జయప్రదం చేయాలని పిలుపు నిచ్చారు.

చిరుధాన్యాల సాగుకు ప్రోత్సాహం

ప్రజాశక్తి-విజయనగరం

చిరు ధాన్యాల సాగును ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని డిఆర్‌డిఎ పీడీ బి.కల్యాణ చక్రవర్తి అన్నారు. వైఎస్ఆర్ఆసరా మూడోవిడత నిధుల విడుదల కార్యక్రమంలో భాగంగా కలెక్టరేట్ ఆడిటోరియం వద్ద శనివారం చిరుధాన్యాల మహోత్సవం నిర్వహించారు. స్వయంశక్తి మహిళలు చిరుధాన్యాలతో తయారు చేసిన ఆహార పదార్థాలను ప్రదర్శించారు ప్రజల్లో చిరుధాన్యాల వల్ల కలిగే ప్రయోజనాలపై కూడా అవగాహన కల్పించే లక్ష్యంతో ప్రదర్శనలను ఏర్పాటు చేసినట్లు చక్రవర్తి తెలిపాయి.

ఓపెన్ స్కూల్ పరీక్షలకు ఏర్పాట్లు

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఏప్రిల్ 3 తేది నుంచి 17 వరకు జరిగే ఓపెన్ స్కూల్ పది, ఇంటర్ పరీక్షలు పగడ్బందిగా నిర్వహించాలని జిల్లా విద్యా శాఖ అధికారి బి.లింగేశ్వర రెడ్డి తెలిపారు. శనివారం ఓపెన్ స్కూల్ చీఫ్ సూపరింటెండెంట్, పర్యవేక్షకులతో శనివారం జిల్లా విద్యాశాఖ కార్యాలయంలో సమావేశం జరిగింది. సుపరెండెంట్,పర్యవేక్షక లతో సమావేశం జిల్లా విద్యా శాఖ కార్యాలయంలో జరిగింది.పదో తరగతి పరీక్షలకు నాలుగు కేంద్రాలు, ఇంటర్ పరీక్షలకు 6 కేంద్రాలు కేటాయించినట్లు తెలిపారు. మధ్యాహ్నం 2.30 గంటల నుంచి 5.30 గంటలు వరకు జరిగే పరీక్షకు అభ్యర్థులకు ఎటువంటి ఇబ్బందీ లేకుండా చూడాలన్నారు. అనంతరం పరీక్ష ఏర్పాట్లు గురుంచి ఎసి లక్ష్మి కుమారి వివరించారు.

2 ఇ-డివిజనల్ మేనేజర్ పోస్టుల భర్తీ

ప్రజాశక్తి-విజయనగరం

జిల్లాలో రెండు ఈ-డివిజనల్ మేనేజర్ పోస్టులను కాంట్రాక్టు పద్ధతిలో భర్తీ చేయనున్నట్లు జిల్లా కలెక్టర్ ఎ.సూర్యకుమారి ఒక ప్రకటనలో తెలిపారు. బొబ్బిలి, చీపురుపల్లి రెవెన్యూ డివిజన్లలో ఒక్కో ఖాళీ ఉందన్నారు. అభ్యర్థులు బిసిఎ, బిఎస్‌సి కంప్యూటర్స్, బిఇ సిఇసి లేదా ఐటి, బి.టెక్ సిఎస్‌ఇ లేదా ఐటి డిగ్రీ లేదా మాస్టర్ డిగ్రీ ఉత్తీర్ణులై ఉండి, ఇంగ్లీషులో మంచి కమ్యూనికేషన్ స్కిల్స్ కలిగి ఉండాలని తెలిపారు. వయసు జులై 1, 2022 నాటికి 21-35 సంవత్సరాల మధ్య ఉండాలన్నారు. నెలకు రూ.22,500 వేతనం ఇ స్తారని, కాంట్రాక్టు కాలం ఒక ఏడాది ఉంటుందని తెలిపారు. దరఖాస్తు దారులకు రాతపరీక్ష నిర్వహిస్తామని, దానిలో ఉత్తీర్ణులైనవారికి జిల్లా కమిటీ ఇంటర్వ్యూ నిర్వహించి, ఎంపిక చేస్తారని తెలిపారు. రెండేళ్లపాటు ఐటి రంగంలో అనుభవం ఉన్నవారికి 5 శాతం వెయిటేజ్ మార్కులు ఇస్తారన్నారు.

పిడుగుపడి నలుగురికి గాయాలు

ప్రజాశక్తి-గుర్ల

మండలం లో శనివారం సాయంత్రం ఉరుములు మెరుపులతో వర్షం కురవడంతో పాటు పిడుగులు పడడంతో నలుగురికి తీవ్ర గాయాలయ్యాయి. పొలంలో మొక్కజొన్న పంట కోత పనులు పని చేస్తున్న సమయంలో వర్షంతో పాటు పిడుగులు పడడం తో కొండగండ్రేడుకు చెందిన మంత్రి అప్పల రాము, మంత్రి సింహాచలం, పొట్నూరు లక్ష్మీ, తరాల జయ గాయపడ్డారు. వెంటనే వీరిని 108 వాహనంలో చీపురుపల్లి ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. వీరిలో ఇద్దరు పరిస్థితి విషమంగా ఉండడం తో కుటుంబ సభ్యులు ఆందోళన చెందుతున్నారు.

బాపనయ్యకు ఘన నివాళి

ప్రజాశక్తి - లక్కవరపుకోట

వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నాయకుడు, సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు గుంటూరు బాపనయ్య 45వ వర్ధంతి జిల్లాలో పలుచోట్ల ప్రజాసంఘాల ఆధ్వర్యాన జరిగింది. లక్కవరపుకోట మండలం నాయుడుపేటలో బాపనయ్య చిత్రపటానికి సిఐటియు జిల్లా ఉపాధ్యక్షులు తమ్మినేని సూర్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ బాపనయ్య మూడుసార్లు శాసనసభ్యుడిగా , ఒకసారి ఎమ్మెల్సీగా గెలుపొంది ప్రజల మన్ననలను పొందారని కొనియాడారు. నిరంతరం ప్రజల మధ్య ఉంటూ ప్రజా సమస్యలపై పని చేసేవారన్నారు. దళితులు ,గిరిజనుల సంక్షేమం కోసం చట్ట సవరణంలో అనేక బిల్లులు తీసుకువచ్చారని వివరించారు. కార్యక్రమంలో వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు గాడి అప్పారావు, సిఐటియు నాయకులు మద్దిల రమణ, రైతు సంఘం నాయకులు చల్లా జగన్ తదితరులు పాల్గొన్నారు.

మెంటాడ : మండలంలోని లోతు గెడ్డ గ్రామంలో వ్యవసాయ కార్మిక సంఘం ఆధ్వర్యాన బాపనయ్య వర్ధంతి జరిగింది. ఆయన చిత్రపటానికి ఐద్వా నాయకులు వి.లక్ష్మి, ఆర్.హరికృష్ణవేణి పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థి సంఘ నాయకుడిగా, వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడిగా ఎదిగిన బాపనయ్య 1940వ దశంలో చల్లపల్లి జమీందారుకు వ్యతిరేకంగా భూములు పంచాలని పోరాటం సాగించారని తెలిపారు. దివిసీమ ఉప్పెనలో పదివేల మంది ప్రజలు చనిపోతే రెండు నెలల పాటు సేవలందించారని తెలిపారు. నేడు పాలకులు రైతుల వద్దనున్న భూములకు కార్పొరేట్‌శక్తులకు అప్పగిస్తూ సంక్షేమానికి తూట్లు పొడుస్తున్నారని అన్నారు.కార్యక్రమంలో రమణమ్మ ఎర్రమ్మ, సుందరమ్మ తదితరులు పాల్గొన్నారు

విజయనగరం టౌన్ : వ్యవసాయ కూలీలను ఐక్యం చేసి కూలి పోరాటాలు చేసిన వ్యవసాయ కార్మిక సంఘం జాతీయ నేత బాపనయ్య అని సిఐటియు నాయకులు బి.రమణ, కె.త్రినాధరావు అన్నారు. బాపనయ్య వర్ధంతిని జొన్న వలసలో నిర్వహించారు. వ్యవసాయ కార్మిక సంఘం నాయకుడు శ్రీను పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం బి. రమణ మాట్లాడారు. కార్య క్రమంలో కంది త్రినాధ్, మజ్జి శ్రీను, కెల్ల సత్యన్నారాయణ, మజ్జి లక్ష్మి, పాల్గొన్నారు.

భోగాపురం : సిఐటియు ఆధ్వర్యాన బాపనయ్య వర్ధంతి జరిగింది. ఆయన చిత్రపటానికి సిఐటియు నాయకలు బి. సూర్యనారాయణ పూలమాల వేసి నివాళులర్పించారు.

కొత్తవలస : మండలంలోని పాత సుంకరపాలెం, ఎర్రవాని పాలెం చెరువులో బాపనయ్య వర్ధంతిని నిర్వహించారు. బాపనయ్య చిత్రపటానికి వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా అధ్యక్షుడు గాడి అప్పారావు పూల మాల వేసి నివాళులు అర్పించారు. అనంతరం మాట్లాడుతూ ఉపాధి హామీ అమలులో కేంద్రం నిర్లక్ష్యం వహిస్తున్నదని, నిధుల కేటాయింపులు తగ్గించిందని అన్నారు. రాబోయే కాలంలో ఉపాధి రక్షణ కోసం పోరాటాలు ఉధృతం చేయాలని, అదే బాపానయ్యకు నిజమైన నివాళి అని అన్నారు.

వేపాడ : మండలంలోని కొండగంగుబూడిలో రైతు సంఘం నాయకులు చల్లా జగన్ ఆధ్వర్యాన బాపనయ్య వర్ధంతి నిర్వహించారు. ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు.

లక్కవరపుకోట : బాపనయ్య చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న సిఐటియు, వ్యవసాయ కార్మిక సంఘం నాయకులు

రాహుల్‌గాంధీపై కక్ష సాధింపు చర్యలు తగవు

ప్రజాశక్తి-విజయనగరం కోట

కేంద్రంలో బిజెపి ప్రభుత్వం రాహుల్ గాంధీ పై కక్ష సాధింపు చర్యలు విడనాడాలి డిసిసి అధ్యక్షులు సరగడ రమేష్ కుమార్ కోరారు. శనివారం ఆ పార్టీ కార్యాలయంలో ఆయన విలేకర్లతో మాట్లాడారు. రాహుల్ గాంధీపై బిజెపి ప్రభుత్వం పార్లమెంట్‌లో అనర్హత వేటు వేయడాన్ని ఖండించారు. కేంద్రంలో బిజెపి ప్రభుత్వం ఏర్పడిన దగ్గర నుండి ప్రజాస్వామ్యానికి తూట్లు పొడిచిందని అన్నారు. ప్రజల హక్కులను బిజెపి ప్రభుత్వం హరిస్తుందన్నారు. చరిత్రలో ఎన్నడూ లేనంతగా కక్ష సాధింపునకు పాల్పడుతోందన్నారు. బిజెపి ప్రభుత్వం చేస్తున్న అకృత్యాలను ప్రజలు గమనిస్తున్నారని, ఎన్నికల్లో తగిన బుద్ధి చెబుతారని అన్నారు. సమావేశంలో పట్టణ అధ్యక్షులు సుంకరి సతీష్ కుమార్ పాల్గొన్నారు.

నేడు పలు ప్రాంతాల్లో విద్యుత్‌కోత

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

విజయనగరంలో ఆదివారం ఉదయం 8గంటల నుంచి 11 గంటల వరకు మూడు గంటల పాటు విద్యుత్ సరఫరాను పలు ప్రాంతాల్లో నిలిపివేయనున్నట్లు ట్రాన్స్‌కో ఎస్‌ఇ నాగేశ్వరరావు తెలిపారు. 33కెవి సబ్ స్టేషన్ మరమ్మతు పనులు చేస్తున్నందున తోటపాలెం, ధర్మపురి ప్రాంతాల్లో విద్యుత్ సరఫరా నిలిపివేస్తామని తెలిపారు. ప్రజలు సహకరించాలని కోరారు

జాతీయ తైక్వాండో పోటీలకు ఆరుగురు ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

ఈనెల 28 నుంచి 31వరకు సబ్ జూనియర్, కాడెట్ నేషనల్ తైక్వాండో ఛాంపియన్ షిప్ పోటీలు రాజస్థాన్ రాష్ట్రం కోట జిల్లాలో జరగనున్నాయి, ఈ పోటీలకు విజయనగరం జిల్లా నుంచి ఆరుగురు క్రీడాకారులు ఎంపికయ్యారు. వారిలో ఎన్.షణ్ముఖ సిద్దార్థనాయుడు , బొంగు యసస్విని, గొట్టుముక్కల జాహ్నవి , గొట్టుముక్కల చరిత, సిహెచ్ హర్ష వర్ధన్, కె.మోక్షిత్ ఉన్నారు. క్రీడాకారులను జిల్లా తైక్వాండో అధ్యక్ష కార్యదర్శులు గురాన అయ్యలు, సి హెచ్ వేణుగోపాల్‌రావు, కోచ్‌లు టి.రాజు, కె.కోటేశ్వరరావు, కోటేశ్వరరావు అభినందించారు.

ఆప్కోలో చేనేత వస్త్ర క్లియరెన్స్ సేల్

ప్రజాశక్తి-విజయనగరం

రాష్ట్ర ప్రభుత్వ రంగ సంస్థ ఆప్కోలో సమ్మర్ సందర్భంగా ఎంపిక చేసిన వస్త్రాలపై ప్రత్యేక తగ్గింపు క్లియరెన్స్ సేల్‌ను ప్రారంభించి గొప్ప అమ్మకాలు జరుగుతున్నాయని ఆప్కో డివిజినల్ మార్కెటింగ్ అధికారి టి. జగదీశ్వర రావు ఒక ప్రకటన లో తెలిపారు. ఈ క్లియరెన్సు సేల్ లో భాగంగా ఒకటి కొంటె మరొకటి ఉచితం, ఒకటి కొంటె రెండు ఉచితం, ప్రత్యేక తగ్గింపు ధరలను అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. క్లియరెన్స్ సేల్ కౌంటర్ విజయనగరం, ఫూల్ బాగ్ కాలనీ, శివాలయం ఎదురుగా, ఆప్కో భవన్, ఆప్కోగోదాములో ఉన్నాయని తెలిపారు. ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

ఎన్ఎంఎంఎస్ స్కాలర్ షిప్‌లకు ముగ్గురు విద్యార్థుల ఎంపిక

ప్రజాశక్తి-విజయనగరం టౌన్

జాతీయ మెరిట్ స్కాలర్ షిప్‌నకు నగరంలోని బిపిఎం హైస్కూల్‌కు చెందిన ముగ్గురు విద్యార్థులు ఎంపికయ్యారు. ఇటీవల నిర్వహించిన పరీక్షల్లో మంచి మార్కులు సాధించిన పూర్ణిమ, ఫాతిమా, హావలు ఎంపికయ్యారని హెచ్‌ఎం తెలిపారు.

హామీల అమలు కోరితే అరెస్టులా?

ప్రజాశక్తి - విజయనగరం ప్రతినిధి



'రాజకీయాల్లో విశ్వసనీయత, పాలనలో పారదర్శకత, నీతి నిజాయితీ అంటూ వల్లె వేసిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహన్‌రెడ్డి ప్రభుత్వం ఎన్నికలకు ముందు ఇచ్చిన హామీలను నెరవేర్చాలని కోరితే మీనమేషాలు లెక్కిస్తోంది. కాదు.. కాదు... నిరసనలు తెలియజేసిన వారిపై నిర్బంధాలు, అరెస్టులకు పాల్పడుతోంది'. ఇదీ ఈ వారం పబ్లిక్ టాక్. కేవలం అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, వారి కుటుంబీకుల్లోనే కాదు, యావత్తు స్కీమ్ వర్కర్లు, ఉద్యోగులు, కార్మికులు, వారికి నాయకత్వం వహిస్తున్న సంఘాలు, ప్రజాస్వామ్యవాదుల్లో ముమ్మరంగా సాగుతున్న చర్చ. ఇందుకు కారణం లేకపోలేదు. అంగన్‌వాడీ కేంద్రాల్లో సమస్యలు పరిష్కరంచడంతోపాటు వాటిలో కార్యకర్తలు, ఆయాలకు మెరుగైన వేతనాలు కల్పించడంతోపాటు ఉద్యోగ, భద్రత, టిఎ, డిఎలు, సకాలంలో బిల్లులు చెల్లిస్తానని 2019 ఎన్నికలకు ముందుకు రాష్ట్రంలో ప్రతిపక్ష నాయకుడిగా హామీలు గుప్పించిన విషయం విధితమే. వాటి అమలు తీరు చూస్తుంటే నేతి బీరకాయలో నెయ్యి వెతికిన చందంగానే ఉంది. ఇప్పటికే నాలుగేళ్లు గడిచిపోయాయి. పలు దఫాలుగా ఎన్నో రూపాల్లో అంగన్‌వాడీలు, స్కీం వర్కర్లు నిరసన కార్యక్రమాలు చేపట్టారు. అయినా అమలు కాకపోవడంతో ఈనెల 20న అంగన్‌వాడీలు చలో విజయవాడ కార్యక్రమాన్నితలపెట్టిన విషయం విధితమే. ఈనేపథ్యంలో యూనియన్ నాయకులతో చర్చలు జరిపి, సమస్యను సానుకూలంగా పరిష్కరించేందుకు చొరవ తీసుకోవాల్సిన ప్రభుత్వం పోలిసులను ఉసుగొల్పింది. పోలీసులు మరింత అత్యుత్యాహ్సం ప్రదర్శిస్తూ చలో అసెంబ్లీకి ముందు రోజు ఆదివారమే విజయవాడకు ప్రయాణమవుతున్న అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్ నాయకులు, కార్యకర్తలతోపాటు వారికి తొలి నుంచీ అండగా నిలుస్తున్న సిఐటియు నాయకులను ఇటు విజయనగరం, అటు పార్వతీపురం మన్యం జిల్లాల్లో సుమారు 100మందికిపైగా ఎక్కడికక్కడ అరెస్టులు చేశారు. విజయనగరంలో సంతకాల వంతెనవద్ద, బొబ్బిలి, డొంకినవలస, గజపతినగరం, పార్వతీపురం స్టేషన్లలో ఎక్కకడికక్కడ దొరికినవారిని దొరికినట్టు నిర్బందించి, పోలీసులు తమ వాహనాల్లో బలవంతంగా తరలించారు. మరికొందర్ని ఇళ్ల వద్దే నిర్బందించారు. స్టేషన్లకు తరలించినవారిని రాత్రి వరకూ అక్కడే ఉంచారు. ఈ చర్యలు అత్యంత హేయమైనవని, ప్రజాస్వామ్యం కల్పించిన హక్కులను కాలరాయడమేనని ప్రజాసంఘాల నాయకులు వ్యాఖ్యానించారు. ఓవైపు ఎమ్మెల్సీ ఎన్నికల్లో ఓటర్లు మట్టికరిపిస్తున్నా ప్రభుత్వానికి బుద్ధిరావడం లేదని మరికొంతమంది విమర్శిస్తున్నారు. ప్రభుత్వం నిర్బందాలు, అరెస్టులకు పాల్పడినంత మాత్రాన అంగన్‌వాడీ కార్యకర్తల నిరసనలు ఆగలేదు. చలో విజయవాడ కార్యక్రమాన్ని భగ్నం చేసినందుకు నిరసనగా మరుచటి రోజు ఉదయాన్ని విజయనగరం, పార్వతీపురం మన్యం జిల్లాలకు చెందిన కార్యకర్తలు ఆయా కలెక్టరేట్లకు చేరుకొని అంగన్‌వాడీ వర్కర్స్ అండ్ హెల్పర్స్ యూనియన్, సిఐటియు నాయకత్వంలో ఆందోళనలు చేపట్టారు. ఈ నేపథ్యంలో ఇప్పటికైనా ప్రజా, కార్మిక, ఉద్యోగ ఉద్యమాలను అణిచివేత చర్యలతో ఆపలేమన్న విషయం ప్రభుత్వం గుర్తించాలని, లేదంటే మునుపటి ప్రభుత్వాల మాదిరిగా తగిన మూల్యం చెల్లించుకోక తప్పదని జనం చర్చించుకుంటున్నారు.



ప్రమాణ స్వీకారం చేస్తున్న సభ్యులు

రెడ్‌క్రాస్ నూతన కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి-విజయనగరం

ఇండియన్ రెడ్ క్రాస్ సర్వసభ్య సమావేశం శనివారం కలెక్టరేట్‌లో డిఆర్‌ఒ ఎం.గణపతి రావు పర్యవేక్షణలో జరిగింది. ఈ సందర్భంగా వివిధ అంశాలపై చర్చించారు. బడ్జెట్, సేవా కార్యక్రమాలపై చర్చించి, నూతన మేనేజింగ్ కమిటీని ఎన్నుకున్నారు. 13మంది సభ్యులతో ఎన్నికైన కమిటీకి చైర్మన్‌గా పూర్వ చైర్మన్ కెఆర్‌డి ప్రసాదరావును తిరిగి ఎన్నుకున్నారు. వైస్‌చైర్మన్‌గా ఆర్.రాజగోపాల్‌నాయుడు, కోశాధికారిగా టి.రామారావు ఎన్నికయ్యారు.ఎన్నికైన సభ్యులతో డిఆర్‌ఒ ప్రమాణ స్వీకారం చేయించారు. రెడ్ క్రాస్ రాష్ట్ర శాఖ తరపున పరిశీలకులుగా రాష్ట్ర వైస్ చైర్మన్ పి.జగన్ మోహన్ రావు గారు, విశాఖపట్నం చైర్మన్ డివై శివ నాగేందర్‌రెడ్డి హాజరయ్యారు. సమావేశంలో జిల్లా కార్యదర్శి కె.సత్యం గత మూడేళ్లగా చేపట్టిన అభివృద్ధి కార్యక్రమాలను వివరించారు. భవిష్యత్తులో మరిన్ని మంచి కార్యక్రమాలు చేపడతామని ఈ సందర్భంగా చైర్మన్ కెఆర్‌డి ప్రసాదరావు తెలిపారు.

రైల్వే స్టేషన్‌లో నేరాలపై నిఘా పెట్టాలి

బొబ్బిలి : రైల్వే స్టేషన్‌లో నేరాలు జరగకుండా నిఘా పెట్టాలని విశాఖ రైల్వే లైన్స్ సిఐ వెంకటరావు కోరారు. బొబ్బిలి రైల్వే స్టేషన్‌ను శనివారం ఆయన ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రైల్వే స్టేషన్‌లో పూర్తిగా నేరాలు జరగకుండా చూడాల్సిన బాధ్యత రైల్వే పోలీసులపై ఉందన్నారు. వేసవి కావడంతో నేరాలు జరిగే అవకాశం ఉందని నిఘా పెంచాలన్నారు. నేరాలు నియంత్రణకు పలు సూచనలు చేశారు. ప్రయాణికులు ఇబ్బందులు పడకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. ఆర్‌పిఎఫ్ కార్యాలయంలో రికార్డులను తనిఖీ చేశారు.

రోడ్లు, కాలువల్లో చెత్త వేస్తే చర్యలు

బొబ్బిలి : పట్టణంలోని రోడ్లు, కాలువలలో చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామని మున్సిపల్ కమిషనర్ ఎస్.శ్రీనివాసరావు హెచ్చరించారు. పట్టణంలోని రైల్వే స్టేషన్, ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డులో పారిశుధ్య పనులను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పరిసరాలను పరిశుభ్రంగా ఉంచుకోవాలన్నారు. రోడ్లు, కాలువల్లో చెత్త వేస్తే చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. రైల్వే స్టేషన్ రోడ్డులో చెత్త పేరుకుపోవడంతో ఆగ్రహం వ్యక్తం చేశారు. రోడ్డుపై చెత్తను హోటల్ యజమానులు వేస్తున్నట్లు గుర్తించి వారికి నోటీసులు జారీ చేయాలని ఆదేశించారు. ఖాళీ కొబ్బరి బొండాలు రోడ్డుపై ఉండటంతో వ్యాపారులపై చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ప్రభుత్వ ఆసుపత్రి రోడ్డుపై ఇసుక, నిర్మాణ సామగ్రి ఉండటంతో ఆయా యజమానులకు నోటీసులు జారీ చేయాలని సూచించారు. ప్రజలకు అసౌకర్యం కల్పిస్తున్న వారిపై చర్యలు తీసుకోవాలని కోరారు. పరిసరాలను పరిశుభ్రంగా ఉంచాలన్నారు. ఆయనతో మున్సిపల్ ఉద్యోగులు ఉన్నారు.

రాహుల్ గాంధీపై కక్షసాధింపు దుర్మార్గం

బొబ్బిలి : కాంగ్రెస్ నేత రాహుల్ గాంధీపై కక్షసాధింపు చర్యలు పాల్పడడం దుర్మార్గమని పిసిసి సభ్యులు మువ్వల శ్రీనివాసరావు, రైతు సంఘం అధ్యక్షులు వేమిరెడ్డి లక్ష్మునాయుడు, రైతు కూలి సంఘం నాయకులు టి.అప్పలనాయుడు అన్నారు. రాహుల్ గాంధీపై పరువునష్టం కేసుకు నిరసనగా శనివారం ఆశ్రాల వీధిలో నిరసన తెలిపారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ రాహుల్ గాంధీపై కక్షసాధింపుతోనే పరువునష్టం దావా కేసు వేశారన్నారు. అక్రమ కేసులతో భయపెట్టలేరన్నారు. ప్రజల ఓట్లతో గెలుపొందిన బిజెపి కార్పొరేట్ సంస్థలకు అనుకూలంగా పాలన చేయడం దుర్మార్గమన్నారు. కక్షసాధింపు చర్యలు మానుకోవాలని డిమాండ్ చేశారు. లేనిచో ప్రజలే బుద్ధి చెబుతారని హెచ్చరించారు. కార్యక్రమంలో కాంగ్రెస్ కార్యకర్తలు పాల్గొన్నారు.

సీజ్ చేసిన వాహనాలకు వేలం

రామభద్రపురం : వివిధ అక్రమ, నిషేధిత వస్తువుల రవాణాలో పట్టుబడిన వాహనాలను వేలం పాట ద్వారా స్థానిక పోలీస్ స్టేషన్‌లో విక్రయించడానికి ఏర్పాట్లు చేస్తున్నట్లు ఎస్ఐ సురేంద్ర నాయుడు తెలిపారు. ఈ మేరకు ఆయన మాట్లాడుతూ గత వేలం పాటలలో నిర్ణీత ధర రాని 3 ద్విచక్ర, 1 ఫోర్‌వీలర్ వాహనాలకు వేలం పాట నిర్వహిస్తామని చెప్పారు. ఆగోస్ 10 గంటలకు ఉత్సాహం ఉన్నవారు ఎవరైనా వచ్చి ఈ పాటలో పాల్గొనవచ్చునన్నారు.

ప్రజలకు మెరుగైన వైద్య సేవలు

వంగర : ఆరోగ్య కేంద్రాల ద్వారా ప్రజలకు మెరుగైన వైద్య సేవలు అందించాలని డిఎంఅండ్‌హెచ్ఒ ఎస్‌వి రమణకుమారి తెలిపారు. ఈ మేరకు స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రాన్ని ఆమె ఆకస్మికంగా శనివారం తనిఖీ చేశారు. ఓపి విభాగం రికార్డుల నిర్వహణ, ఉద్యోగుల హాజరు, ఆపరేషన్ థియేటర్‌ను పరిశీలించారు. అనంతరం మందులు భద్రపరుచు గదిని తనిఖీ చేశారు. మందులు నిల్వలపై అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం సిబ్బందితో సమావేశం నిర్వహించి ప్రజలకు అందుతున్న సేవలపై ఆరా తీశారు. ఆమె మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో హెల్త్ హ్యాండ్ వెల్నెస్ సెంటర్లలో పూర్తిస్థాయి సిబ్బందిని నియమించేందుకు చర్యలు తీసుకుంటున్నట్లు తెలిపారు. వైద్య అధికారి సౌమ్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

ఘనంగా నారాయణ స్కూలు వార్షికోత్సవం

శృంగవరపుకోట : స్థానిక నారాయణ కేంబ్రిడ్జ్ స్కూల్ వార్షికోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఎస్‌కోట సిఐ ఎస్.సింహాద్రినాయుడు కార్యక్రమాన్ని ప్రారంభించారు. విద్యార్థులకు క్రమశిక్షణతో కూడిన విద్యతో పాటు నైతిక విలువలను బోధించాలని కోరుతూ తల్లిదండ్రుల పాత్రను గుర్తు చేశారు. విశిష్ట అతిథిగా మండల ఎడ్యుకేషన్ అధికారి పి.సత్యనారాయణ పాల్గొని మాట్లాడుతూ ప్రాథమికవిద్య భవిష్యత్తుకు సోపానమని, కృషి, పట్టుదలతో జీవితంలో ఉన్నత శిఖరాలను అధిరోహించవచ్చునన్నారు. విద్యార్థులలో దాగివున్న సృజనాత్మకతను తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు ముందే గుర్తించి వారిని ప్రోత్సహిస్తే అద్భుతాలు సాధిస్తారని పాఠశాల ప్రిన్సిపాల్ సి.హెచ్.శేషు అభిప్రాయం వ్యక్తం చేశారు. నార్త్ కోస్టల్ డిజియం డి.హనుమంతరావు మాట్లాడుతూ నేటి పోటీ ప్రపంచంలో ఉన్నత శిఖరాలను చేరడానికి ప్రణాళిక బద్ధమైన విద్య చాలా అవసరమని అటువంటి విద్యను అందించడంలో తమ సంస్థ మొదటి స్థానంలో ఉందని తెలిపారు. ఈ కార్యక్రమంలో పాఠశాల రీజనల్ ఇన్‌చార్జ్ రవికుమార్, ఎజియం శ్రీనివాస్, కో-ఆర్డినేటర్స్ నాజిని, గ్రేషి, పాఠశాల వైస్ ప్రిన్సిపాల్స్ ఎయన్ఆర్ లక్ష్మీ, రోజా ఉఉపాధ్యాయులు, తల్లిదండ్రులు పాల్గొన్నారు

స్పందన వినతులను పరిష్కరించాలి

గజపతినగరం : స్పందనలో వచ్చిన వినతులను వెంటనే పరిష్కరించాలని ఎంపిడిఒ పప్పు సుదర్శన్‌రావు అన్నారు. జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మండల స్థాయి అధికారులు, పంచాయతీ సెక్రటరీలు అందరూ ప్రతి సోమవారం నిర్వహిస్తున్న స్పందన కార్యక్రమానికి ఉదయం 10 గంటల నుండి 1గంట వరకు హాజరై వస్తున్న వినతులను, అర్జీలను ఆయా శాఖ అధికారులు అక్కడే పరిష్కరించాలని అన్నారు.

రాజీతో సత్వర పరిష్కారం

బొబ్బిలి : కేసులు రాజీతో సత్వర పరిష్కారం లభిస్తుందని సీనియర్ సివిల్ జడ్జి టి.వాసుదేవన్ అన్నారు. స్థానిక కోర్టులో శనివారం లోక్ అదాలత్ నిర్వహించారు. రిటైర్మెంట్ పెన్షన్ ఇవ్వడం లేదని న్యాయవాది బి.రవి ద్వారా ఆర్‌టిసి రిటైర్డ్ ఉద్యోగి ఆర్.రాజేశ్వరరావు కోర్టును ఆశ్రయించగా పెన్షన్ ఇచ్చేందుకు విశాఖ చీఫ్ పిఎఫ్ ఆఫీసు అధికారి వైవి రామారావు ముందుకు రావడంతో లోక్ అదాలత్‌లో కేసును రాజీ చేశారు. కేసులు రాజీతో ఇరు వర్గాలకు న్యాయం జరుగుతుందని జడ్జి వాసుదేవన్ అన్నారు.

ఫలించిన ఆమ్‌ఆద్మీ పోరాటం

శృంగవరపుకోట : ఆమ్ ఆద్మీ పార్టీ చేసిన పోరాటం ఫలితంగా రోడ్డు మీద ఆక్రమణలను తొలగించారని ఆమ్ ఆద్మీ పార్టీ నియోజకవర్గం కన్వీనర్ పూసపాటి ప్రతాప్‌వర్మ తెలిపారు. శనివారం ఆయన స్థానిక విలేకరులతో మాట్లాడుతూ పట్టణంలోని దేవిబొమ్మ కూడలిలో గల క్వాలిటీ హెటల్ వెనుక ఆమ్ ఆద్మీ పార్టీ కార్యాలయానికి వెళ్లే రోడ్డును కొంతమంది ఆక్రమించి బడ్డీలు తెచ్చి పెట్టారని, చీకటి పడితే బడ్డీలు మాటున అసాంఘిక కార్యకలాపాలు చోటుచేసుకునేవని అన్నారు. ఆ దారిని స్థానికేతరులు మరుగుదొడ్లుగా వినియోగించడంతో ఆ దారి గుండా వెళ్లేవారు తీవ్ర అసౌకర్యానికి గురయ్యేవారని అన్నారు. ఆక్రమణలు తొలగించి రోడ్డును అందుబాటులోకి తీసుకునిరావాలని జిల్లా కలెక్టర్‌కు 'స్పందన' కార్యక్రమంలో ఆమ్ ఆద్మీ పార్టీ ఇచ్చిన ఫిర్యాదు మేరకు అధికారులు స్పందించి చర్యలు తీసుకున్నందుకు అధికారులకు ఆయన ధన్యవాదాలు తెలియజేశారు.

నేరాలు ఘోరాలు

శివాలయంలో హుండీ చోరీ

డెంకాడ : మండలంలోని మోపాడ శివాలయంలో శుక్రవారం రాత్రి దొంగలు పడి సుమారుగా రూ. 15వేలతో ఉన్న హుండీని ఎత్తికెళ్లారు. ఈ మేరకు దేవాలయ అర్చకులు ఫణీంద్ర కుమార్ డెంకాడ పోలీసులకు శనివారం ఫిర్యాదు చేశారు. ఎస్ఐ మహేష్ సంఘటన స్థలానికి చేరుకుని విచారణ చేపట్టారు. దేవాలయం దగ్గరలో ఉన్న మామిడి తోటలో హుండీని వదిలి అందులో ఉన్న డబ్బులను ఎత్తుకు వెళ్లినట్లు పోలీసులు గుర్తించారు. గుడికి ఉన్న తాళాలను సైతం విరగగొట్టి దుండగులు ఈ దుశ్చర్యకు పాల్పడ్డారని ఎస్ఐ తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు వెల్లడించారు. అయితే ఎమ్మెల్యే స్వగ్రామంలో దొంగతనం జరగడం చర్చనీయాంశమవుతోంది.

మోటార్ సైకిల్ ఢీకొని మహిళ మృతి

డెంకాడ : మండలంలోని డీకొల్లం పంచాయతీ ఆర్ ముంగినాపల్లి వద్ద మోటారు సైకిల్ ఢీకొని మహిళ మృతి చెందిన సంఘటన శనివారం జరిగింది. పోలీసులు తెలిపిన వివరాలు ప్రకారం.. చెల్లంపేట పంచాయతీ కె.ముంగినాపల్లికి చెందిన బి సూరమ్మ (61) ముంగనాపల్లిలో రోడ్డు దాటుతుండగా కుమిలి నుంచి విజయనగరం వస్తున్న మోటార్ సైకిలతో బలంగా ఢీకొన్నాడు. దీంతో ఆమెకు తీవ్ర గాయాలై అక్కడికక్కడే మృతి చెందింది. స్థానిక ఎస్ఐ యు మహేష్ కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

వంద శాతం ఉత్తీర్ణత సాధించాలి

ప్రజాశక్తి - వంగర

10వ తరగతి పరీక్షలలో విద్యార్థినిలు వంద శాతం ఉత్తీర్ణత సాధించే విధంగా ప్రణాళిక రూపొందించాలని డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకు లాల జిల్లా సమన్వయకర్త (డిసిఒ) బలగా చంద్రావతి అన్నారు. మండలంలోని మడ్డువలస బాలికల గురుకులాన్ని ఆమె శనివారం తనిఖీ చేశారు. రికార్డులు నిర్వహణ విద్యార్థులు హాజరు విద్యా ప్రమాణాలను పరిశీలించారు. అనంతరం విద్యార్థినిలతో కలిసి భోజనం చేసి వంటకాలను రుచి చూశారు. అనంతరం ఉపాధ్యాయునితో సమావేశం నిర్వహించి పదో తరగతి విద్యార్థులకు ప్రత్యేక తర్ఫీదివ్వాలని సూచించారు. ఈ కార్యక్రమంలో ప్రిన్సిపాల్ పద్మావతి, పాల్గొన్నారు.

వంగర: విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న చంద్రావతి

పది పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం సాధించాలి

జామి: పదో తరగతి పరీక్షల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించాలని యుటిఎఫ్ జిల్లా ప్రధాన కార్యదర్శి జెవిఆర్‌కె ఈశ్వరరావు అన్నారు. ఇటీవల ఎస్ఎఫ్ఐ, యుటిఎఫ్ సంయుక్తంగా జిల్లా వ్యాప్తంగా నిర్వహించిన ప్రజ్ఞా వికాస పరీక్షల విజేతలకు మండల కేంద్రంలోని ఉన్నత పాఠశాలలో పురస్కారాలను శనివారం అందించారు. ఈ సందర్భంగా ఈశ్వరరావు, ఎస్ఎఫ్ఐ జిల్లా సహాయ కార్యదర్శి ఎం.హర్ష మాట్లాడుతూ పదో తరగతి విద్యార్థులకు పరీక్ష భయాన్ని పోగొట్టడానికి మోడల్ పదవ తరగతి పరీక్ష జిల్లా వ్యాప్తంగా 12వేల మందితో నిర్వహించామని తెలిపారు. ఈ మోడల్ పదో తరగతి పరీక్షల్లో జామి మండలంలో మొదటి స్థానంలో 79 మార్కులతో కే.నరేష్, 78 మార్కులతో ఎస్.జాహ్నవి రెండో, 72 మార్కులతో పి.సౌమ్యకుమారి మూడో స్థానంలో నిలిచారన్నారు. పబ్లిక్ పరీక్షల్లో వంద శాతం మార్కులు సాధించాలన్నారు.

జామి: విజేతలకు బహుమతులు ప్రదానం చేస్తున్న హెచ్ఎం

కూలీలతో ప్రైవేటు పనులు

లక్కవరపుకోట : మండల కేంద్రంలో ఉన్న చెరుకు కాటా ప్రాంగణ ఖాళీ స్థలంలో ఉన్న తుప్పులను తొలగించడానికి శనివారం ఉపాధి కూలీల చేత పనులు చేయించారు. గ్రామీణ ఉపాధి హామీ పథకానికి చెందిన కొంతమంది కూలీలచే ఫీల్డ్ అసిస్టెంట్ అరుణకుమారి దగ్గరుండి పనులు చేయించారు. అధికారుల ఆదేశాల మేరకు పనులు చేపిస్తున్నట్లు ఆమె తెలిపారు. ఈ విషయంపై స్థానిక ఎంపిడిఒ కె. రూపేష్ వద్ద ప్రస్తావించగా చెరుకు కాటా సమీప చెరువు వద్ద పనులు చేయమంటే పొరపాటున చెరుకు కాటా ప్రాంగణ ఖాళీ స్థలంలో పనులు చేశారన్నారు. ఈ పనుల గురించి తనకేమీ తెలియదని ఎపిఒ రమ్య అనడం శోచనీయం.

ప్రారంభానికి సిద్ధం..

వంగర : స్థానిక మండల కేంద్రంలో నూతనంగా నిర్మించిన తహశీల్దార్ నూతన కార్యాలయ భవనం ప్రారంభానికి సిద్ధంగా ఉంది. భవనం లేక గత కొన్నేళ్లుగా ఇబ్బందులు పడుతున్న రెవెన్యూ అధికారులు ఈ భవనం పూర్తయితే భవన సమస్య తీరనుందని ఎదురు చూస్తున్నారు.

ఘనంగా మాజీ ఎమ్మెల్యే కోళ్ల జన్మదిన వేడుకలు

లక్కవరపుకోట: మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పుట్టినరోజు వేడుకలు మండల కేంద్రంలో ఉన్న ఆమె నివాసంలో శనివారం ఘనంగా నిర్వహించారు. లక్కవరపుకోట, కొత్తవలస, వేపాడ, శృంగవరపుకోట, జామి మండలాలకు చెందిన తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలు అధిక సంఖ్యలో ఈ వేడుకలలో పాల్గొని ఆమెకు శుభాకాంక్షలు తెలియజేశారు. అధిక సంఖ్యలో టిడిపి శ్రేణులు మండలానికి చేరుకోవడంతో లక్కవరపుకోటలో పండగ వాతావరణం నెలకొంది.

టిడిపిలో పలువురు చేరిక

కొత్తవలస : మండలానికి చెందిన వైసిపి నాయకులు ఎల్లపు సూరిబాబు, రాఘవేంద్రరావు ఆధ్వర్యంలో 150 మంది కార్యకర్తలు ఎస్.కోట మాజీ ఎమ్మెల్యే, నియోజకవర్గ పార్టీ ఇంచార్జ్ కోళ్ల లలితకుమారి, టిడిపి రాష్ట్ర కార్యనిర్వాహక కార్యదర్శి కోళ్ల బాలాజీ అప్పల రామప్రసాద్‌ల సమక్షంలో శనివారం టిడిపిలో చేరారు. లలిత కుమారి పుట్టినరోజు సందర్భంగా పార్టీ నాయకులు, పార్టీ శ్రేణుల సమక్షంలో ముందుగా కేక్ కట్ చేసి సంబరాలు చేశారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ రాష్ట్రంలో జగన్ పాలనపై ప్రజలు విసుగుపోయారన్నారు. వైసిపి నుంచి టిడిపిలో చేరడం ఆనందంగా ఉందని, పార్టీ అభివృద్ధికి కృషి చేసి చంద్రబాబు నాయకత్వాన్ని బలపరచాలని సూచించారు. పార్టీలో చేరిన వారందరికీ లలితకుమారి కండువా వేసి సాధారంగా ఆహానించారు. అనంతరం బైక్ రాలీ పెద్దఎత్తున నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి సీనియర్ నాయకులు కోళ్ల శ్రీను, బొబ్బిలి అప్పారావు, కనకాల శివ, బంగారు రమేష్, కోరుపోలు అప్పారావు, పీవి రత్నాజీ, పులిబంటి రాము, పిల్లా అప్పలరాజు, కొల్లి వెంకట రమణమూర్తి, గొంప దుర్గా, ఉమేష్ తదితరులు పాల్గొన్నారు.

లలితకుమారికి శుభాకాంక్షలు చెబుతున్న నాయకులు

శృంగవరపుకోట : మాజీ ఎమ్మెల్యే కోళ్ల లలితకుమారి పుట్టినరోజు వేడుకలను శనివారం ఘనంగా నిర్వహించారు. ఆమెకు ఐటిడిపి రాష్ట్ర కార్యదర్శి చెక్కా కిరణ్ కుమార్, నియోజకవర్గ కార్యదర్శి కాపుగంటి వాసు, అనకాపల్లి చెల్లయ్య, నాయకులు బీశెట్టి అరుణ, పెదగాడి రాజు తదితరులు పుష్పగుచ్ఛాలు అందజేసి శుభాకాంక్షలు తెలిపారు. ఆమె చేత కేక్ కట్ చేయించి సంబరాలు జరుపుకున్నారు.

కార్మిక, కర్షక ప్రదర్శన జయప్రదం చేయండి

ప్రజాశక్తి- నెల్లిమర్ల

వచ్చే నెల 5న ఢిల్లీలో జరిగే కార్మిక కర్షక ప్రదర్శనను జయప్రదం చేయాలని సిఐటియు జిల్లా కమిటీ సభ్యులు కిల్లంపల్లి రామారావు పిలుపునిచ్చారు. శనివారం ఆయన కొత్త పేటలో ఉపాధి హామీ పనులు చేస్తున్న వేతనదార్ల వద్దకు వెళ్లి చలో ఢిల్లీ కార్యక్రమంపై ప్రచారం చేశారు. ఆయన మాట్లాడుతూ ఉపాధి వేతన దారులకు ప్రభుత్వం కనీస సౌకర్యాలు కల్పించక పోవడం అన్యాయమన్నారు. ముఖ్యంగా టెంట్లు, తాగు నీరు, ప్రథమ చికిత్స పెట్టెలు ఏర్పాటు చేయకపోవడం సిగ్గుచేటన్నారు.

కూలీలతో మాట్లాడుతున్న రామారావు

ప్రస్తుతం ప్రభుత్వం ఉపాధి హామీ కూలీలకు ఇస్తున్న రూ. 200 చాలదని రోజుకు రూ. 600 వేతనం ఇవ్వాలని డిమాండ్ చేశారు.

మల్లివీడు ఆశా కార్యకర్తకు ఉత్తమ అవార్డు

లక్కవరపుకోట : మండలంలోని మల్లివీడు ఆశా కార్యకర్తగా విధులు నిర్వహిస్తున్న కర్రి భవానికి జిల్లా ఉత్తమ అవార్డు లభించింది. తమ విధి నిర్వహణలో బాధ్యతగా వ్యవహరిస్తూ తమ పరిధిలో ఉన్న ప్రజలకు వైద్య సేవలు అందించడంలో చురుకైన పాత్ర వహించడంతో ఆమెకు ఈ అవార్డు దక్కింది. ప్రపంచ క్షయ వ్యాధి దినోత్సవం సందర్భంగా జిల్లా కలెక్టర్ సూర్యకుమారి అవార్డు గ్రహీత భవానికి ప్రశంసా పత్రంతో పాటు ట్రోఫీని అందజేశారు. ఈ సందర్భంగా స్థానిక పిహెచ్‌సి వైద్య అధికారులు పివి మురళీకృష్ణ, ఆర్ సామ్రాజ్యలక్ష్మి, వైద్య సిబ్బందితో పాటు సిఐటియు జిల్లా నాయకులు తమ్మినేని సూర్య నారాయణ, గాడి అప్పారావు, మద్దిల రమణ, చల్లా జగన్ తదితరులు భవానీకి అభినందనలు తెలిపారు.

ఆత్మస్థైర్యంతో చదివితే విజయం తథ్యం

ప్రజాశక్తి- డెంకాడ

ఆత్మస్థైర్యంతో చదివితే విజయం సాధించడం తథ్యమని బెంగళూరుకు చెందిన విప్రో గ్లోబల్ జనరల్ మేనేజర్ హెచ్ఆర్ ప్రవీణ్ కామత్ అన్నారు. జొన్నాడ వద్ద గల లెండి ఇంజనీరింగ్ కళాశాలలో 15వ వార్షికోత్సవ సంబరాలు శనివారం ఘనంగా జరిగాయి. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇంజనీరింగ్‌లో ఆత్మస్థైర్యంతో ముందడుగు వేయాలన్నారు. ప్రయాగాత్మక, పరిశోధనాత్మక ధోరణితో విద్యాభ్యాసం జరగాలని సూచించారు. అందుకు నైపుణ్యాలను పెంపొందించే దిశగా అందరు ముందుకు కదలాలని అన్నారు. ఈ ప్రక్రియలో విజయాలు వైఫల్యాలు రెండు ఎదురవతాయని అందుకు ధీటుగా ముందుకు సాగాలని, జ్వలించే కాంక్షతో ఆశయ సాధన కై పాటు పడాలని పిలుపునిచ్చారు. సంస్థ ప్రిన్సిపాల్ డాక్టర్ వివి రామరెడ్డి వార్షిక నివేదికను చదివి వినిపిస్తూ సంవత్సరాంతం అన్నిరంగాలలో ప్రతిభ కనబరచిన విద్యార్థులను అధ్యాపక బృందాన్ని కొనియాడారు. సంస్థ చైర్మన్ పి. మధుసూదన రావు మాట్లాడుతూ విలువలతో కూడిన విద్యాభ్యాసాన్ని కొనసాగించే ప్రక్రియతో లెండి కళాశాలను 15 ఏళ్ళు ముందుకు తీసుకు వెళున్న ప్రిన్సిపాల్, అధ్యాపక బృందం, సిబ్బందిని అభినందించారు. చేతులమీదుగా కళాశాల వార్షిక సంచికను విడుదల చేసారు. పలు క్రీడా పోటీలలో విజయం సాదించిన విద్యార్థులకు బహుమతులను అందజేశారు. ఈ కార్యక్రమంలో సంస్థ సెక్రటరీ అండ్ కరెస్పాండంట్ శివ రామకృష్ణ శ్రావ్య బుర్ర, కళాశాల స్టూడెంట్ ప్రెసిడెంట్ నిఖిల్, వైస్ ప్రిన్సిపల్ హరిబాబు, అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

డాన్సు చేస్తున్న విద్యార్థులు

'విద్య.. స్థితిగతులను మారుస్తుంది'

ప్రజాశక్తి- శృంగవరపుకోట

మంచి విలువలతో కూడిన విద్య మన స్థితిగతులను మారుస్తుందని అటువంటి విద్య ప్రభుత్వ పాఠశాలలలోనే లభిస్తుందని టిడిపి నియోజకవర్గ యువనేత గొంప కృష్ణ అన్నారు. శనివారం మండలంలోని అన్ని ప్రభుత్వ పాఠశాలల్లో 10వ తరగతి చదువుతున్న విద్యార్థులకు పబ్లిక్ ఎగ్జామ్స్ నిమిత్తం పరీక్ష రాసే ప్యాడ్‌లు, పెన్నులు, ఇతర స్టేషనరీ మెటీరియల్‌లను పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు రాయివరపు చంద్ర శేఖర్, మహేష్ ఆడారి, జుత్తాడ రామసత్యం, కనిశెట్టి ఈశ్వరరావు తదితరులు పాల్గొన్నారు.

శ్రీ సత్యసాయి ట్రస్ట్ ఫర్ యూనివర్సల్ వెల్ఫేర్ ఆధ్వర్యంలో మండలంలో గల 8 ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో చదువుతున్న పదో తరగతి పిల్లకు పరీక్ష ఉపకరణాలు శనివారం పంపిణీ చేశారు. స్థానిక బాలికొన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయని టీ. విజయలక్ష్మి అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఎంపిపి సండి సోమేశ్వరరావు, జెడ్‌పిటిసి ఎం. వెంకట లక్ష్మీ, ట్రస్ట్ నిర్వహకులు శ్రీరామ్ మూర్తి, ఇఒపిఆర్‌డి ఎంవిఎ శ్రీనివాసరావు, ఎంఇఒ పి. సత్యనారాయణ, సర్పంచ్ సంతోష కుమారి, పలువురు సర్పంచులు, ఎంపిటిసిలు, వార్డు సభ్యులు పాల్గొన్నారు.

జామి: స్థానిక జిల్లాపరిషత్ ఉన్నత పాఠశాల, అలమండ జెడ్‌పిహెచ్ పాఠశాలలో పదో తరగతి చదువుతున్న 200 విద్యార్థులకు పబ్లిక్ ఎగ్జామ్స్ కొరకు పరీక్ష రాసే ప్యాడ్‌లు, పెన్నులు, ఇతర స్టేషనరీ మెటీరియల్‌లను టిడిపి నియోజకవర్గం నాయకులు గొంప కృష్ణ పంపిణీ చేశారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఉత్తమ ఫలితాలు సాధించాలన్నారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు లగుడు రవికుమార్, జుత్తాడ రామసత్యం, మంగరాజు, మాదిబోయిన, ఏరినాయుడు దండుపాటి తదితరులు పాల్గొన్నారు.

డ్రోన్ పైలట్లకు శిక్షణ

- డిజిసిఎ నుంచి అనుమతులు మంజూరు
- పర్లాకిమిడిలో మొదటి విడత శిక్షణ

ప్రజాశక్తి - నెల్లిమర్ల

సెంచూరియన్ విశ్వవిద్యాలయంలో డ్రోన్ పైలట్లకు రిమోట్ పైలట్ ట్రెనింగ్ ఆపరేషన్ (ఆర్పిటివో)లో శిక్షణనిచ్చేందుకు డైరెక్టరేట్ జనరల్ ఆఫ్ సివిల్ ఏవియేషన్ (డిజిసిఎ) నుంచి అనుమతులు మంజూరయ్యాయి. ఈ నేపథ్యంలో సెంచూరియన్ డ్రోన్ల తయారీతోపాటు పైలట్లకు శిక్షణనివ్వడానికి సన్నద్ధమవుతోంది. విజయనగరం, పర్లాకిమిడి క్యాంపస్‌లలో 1000 మంది పైలట్లకు శిక్షణనివ్వడానికి ఏర్పాట్లు చేస్తున్నారు. మరోపక్క వ్యవసాయ రంగానికి ఉపయోగపడే కృషక్ డ్రోన్ల తయారు చేయడానికి ముమ్మరంగా ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఇందుకు 16 లీటర్ల సామర్థ్యం గల కృషక్ డ్రోన్లను తయారు చేయడం వల్ల రైతులకు ఎక్కువ ప్రయోజనం ఉంటుంది.

పరిశోధనలకు ప్రాధాన్యత

డ్రోన్ల సామర్థ్యం పెంచేందుకు అవసరమైన పరిశోధనలు చేపట్టనున్నారు. దీనివల్ల రైతులకు, అటు ప్రభుత్వానికి మేలు కలగనుంది. రానున్న ఖరీఫ్ నాటికి రైతులు తమ పొలంలో డ్రోన్ల సహకారంతో ఎరువులు, పురుగు మందులు పిచికారీ చేసుకునే వెసులుబాటు కలగనుంది. ఈ డ్రోన్లతో ప్రభుత్వం కూడా రిమోట్ ప్రాంతాలలో అవసరమైన సమాచారం సేకరించడానికి ఉపయోగపడనుంది. డ్రోన్ల మరమ్మతుల కోసం హంగర్ కూడా ఏర్పాటు చేస్తున్నట్టు వైస్ ఛాన్సలర్ ప్రొఫెసర్ జిఎస్ఎన్ రాజు తెలిపారు.

డ్రోన్ పైలెట్లకు శిక్షణ ఇస్తున్న ట్రైనీ

న్యాయవాదుల సంఘం జిల్లా అధ్యక్షులుగా కండాపు

ప్రజాశక్తి- బొబ్బిలి

జిల్లా భారత న్యాయవాదుల సంఘం ఐఎఎల్ జిల్లా మహాసభలు శనివారం బొబ్బిలి పట్టణంలోని స్థానిక ఆర్‌టిసి కాంప్లెక్స్ దరి ఎన్‌జిఒ భవనంలో సీనియర్ న్యాయవాది కండాపు ప్రసాదరావు అధ్యక్షతన నిర్వహించారు. ఈ మహాసభలకు విశాఖపట్నం ల్యాండ్ ఎక్విజేషన్ ప్రీ సైడింగ్ అధికారి, జడ్జి పుంగట్ల సత్యారావు, భారత న్యాయవాదుల సంఘం ఐఎఎల్ రాష్ట్ర కార్యనిర్వాహక అధ్యక్షులు కేవిస్ సురేష్ కుమార్, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు భగవతమ్మ పాల్గొని మాట్లాడారు. అనంతరం జిల్లా కార్యవర్గ సభ్యులను ఎన్నుకున్నారు. జిల్లా అధ్యక్షులుగా కండాపు ప్రసాదరావు, జిల్లా ప్రధాన కార్యదర్శిగా రెడ్డి శ్రీనివాసరావును ఎన్నుకొన్నారు. జిల్లా అధ్యక్షులుగా ఎన్నికైన సీనియర్ న్యాయవాది కండాపు ప్రసాదరావు మాట్లాడుతూ న్యాయవాదుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని హామీ ఇచ్చారు. జిల్లా మహాసభలకు జిల్లా నుండి పెద్ద ఎత్తున హాజరైన న్యాయవాదులకు ప్రత్యేక ధన్యవాదాలు తెలిపారు.

విఒఎలకు బహుమతులు

ప్రజాశక్తి- రేగిడి

మండలంలోని వావిలవలసకు చెందిన విఒఎ గండు మణి కుమారికి చిరుధాన్యాల వంటల పోటీలలో ప్రథమంగా నిలవడంతో జెడ్‌పి చైర్మన్ మజ్జి శ్రీనివాసరావు, జిల్లా కలెక్టర్ సూర్య కుమారి, డిఆర్‌డిఎ పీడీ కళ్యాణ చక్రవర్తి, డ్వామా పీడీ చేతుల మీదగా అవార్డు శనివారం అందుకున్నారు. ఆర్‌డిఎ ఆధ్వర్యంలో చిరుధాన్యాలతో వంటల పోటీలు నిర్వహించారు. విజయనగరం జిల్లాలో అన్ని మండలాల నుంచి విఒఎలు చిరుధాన్యాలు తయారు చసిన పలు రకాల వంటలు ప్రదర్శనలో ఉంచారు. ఈ పోటీలలో రేగిడి మండలానికి ప్రథమ బహుమతి రావడం ఆనందంగా ఉందని ఎపిఎం మంగమ్మ, ఇందిరా క్రాంతి సమాఖ్య సంఘం ప్రతినిధులు, అభినందించారు.

ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం

ప్రజాశక్తి- నెల్లిమర్ల

ఉచిత వైద్య శిబిరాలు సద్వినియోగం చేసుకోవాలని నగర పంచాయతీ వైస్ చైర్మన్ సముద్రపు రామారావు కోరారు. శనివారం జరజాపుపేటలో ఎహెచ్ఒ ఫౌండేషన్ సౌజన్యంతో పాత పంచాయతీ భవనం వద్ద ఉచిత మెగా వైద్య శిబిరాన్ని విశాఖపట్నం మెడి కవర్ హాస్పిటల్ ఆధ్వర్యంలో జనరల్ మెడిసిన్ ఉచిత శిబిరం, స్ఫూర్తి ఐ కేర్ ద్వారా ఉచిత ఐ క్యాంప్ శిబిరం, పార్థ డెంటల్ కేర్ వారి ద్వారా ఉచిత డెంటల్ క్యాంపు శిబిరాన్ని నిర్వహించారు. ఉచిత మెగా వైద్య శిబిరాన్ని వైస్ చైర్మన్ సముద్రపు రామారావు ప్రారంభించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఈ ఉచిత మెగా శిబిరాన్ని సుమారు 250 మంది వినియోగించుకున్నారని చెప్పారు. ఈ కార్యక్రమంలో జరజాపుపేట కౌన్సిలర్లు, ఏహెచ్ఒ ఫౌండేషన్ బ్లడ్ కోఆర్డినేటర్ కె. రాజేష్, మెడికవర్ హాస్పటల్ డాక్టర్ చిన్ని కృష్ణ, డాక్టర్ చరిష్మా, స్ఫూర్తి ఐ కేర్ భువన్ సాగర్, పార్థ డెంటల్ కేర్ డాక్టర్ హేమ, పాల్గొన్నారు.

ఆరోగ్యం- పరిశుభ్రత పై అవగాహన

రేగిడి : మండలంలోని మునకలవలస గ్రామంలో రాజాం జిఎంఆర్ఐటి, ఎన్ఎస్ఎస్ యూనిట్ ఆధ్వర్యంలో శనివారం రెండవ రోజు ప్రత్యేక సేవ శిబిరం నిర్వహించారు. ఎన్ఎస్ఎస్ ప్రోగ్రాం అధికారి కెవిఎస్ ప్రసాద్ ఆధ్వర్యంలో 50 మంది ఎన్ ఎస్ఎస్ వాలంటీర్ల విద్యార్థులతో ఆరోగ్యం-పరిశుభ్రత అంశంపై ప్రజలకు అవగాహన కల్పించి ర్యాలీ నిర్వహించారు. అనంతరం గ్రామంలో రాజాం జియమ్ఆర్ కేర్ ఆసుపత్రి సౌజన్యంతో ఉచిత జనరల్ వైద్య శిబిరం నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో డాక్టర్ సతీష్ కుమార్ 160 మంది రోగులకు వైద్య తనిఖీలు నిర్వహించారు. అవసరమైన రోగులకు ఉచిత మందులు పంపిణీ చేశారు. అనంతరం స్థానిక ప్రాథమిక పాఠశాల విద్యార్థులకు వివిధ పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ సర్పంచ్ వి. చంద్ర శేఖర్ రావు, పాఠశాల హెచ్ఎమ్ సూర్య కుమారి, ఉపాధ్యాయులు, సచివాలయం సిబ్బంది, గ్రామ ప్రజలు, గ్రామ యువత పాల్గొన్నారు

నెల్లిమర్ల: వైద్య పరీక్షలు చేయించుకుంటున్న ఎస్ఐ

కొట్యాడలో 116 మందికి వైద్య సేవలు

లక్కవరపుకోట : మండలంలోని కొట్యాడలో శనివారం నిర్వహించిన ప్రభుత్వ హొమియో వైద్య శిబిరంలో 116 మందికి వైద్య పరీక్షలు చేశారు. వీరిలో కీళ్ల నొప్పులు, మలబద్ధకం, గ్యాస్ ట్రబుల్, నిద్ర సరిగ్గా పట్టకపోవడం వంటి వ్యాధులతో ఎక్కువ మంది ఉన్నారని హోమియో వైద్యాధికారి డాక్టర్ కె మోహనమూర్తి తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇటీవల కురుస్తున్న అకాల వర్షాలతో అప్రమత్తంగా ఉండాలని సూచించారు. అనంతరం రోగులకు మందులు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఫార్మసిస్ట్ ఎం ప్రభాకరరావు , ఏఎన్ఎం, ఆశాలు పాల్గొన్నారు.

సొసైటీ అభివృద్ధికి పాటుపడాలి

మెంటాడ : సొసైటీ అభివృద్ధికి ప్రతి ఒక్కరూ పాటుపడాలని ఎంపిపి రెడ్డి సన్యాసినాయుడు అన్నారు. మెంటాడ పిఎసిఎస్ సర్వసభ్య సమావేశం శనివారం జరిగింది. ఈ సమావేశం మెంటాడ సొసైటీ అధ్యక్షుడు తాడ్డి రామచంద్రరావు అధ్యక్షతన జరిగింది. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మిగతా బ్యాంకులు కన్నా అతితక్కువ వడ్డీకి రుణాలు పొందవచ్చునని ఆయన చెప్పారు. సొసైటీ ద్వారా అతి తక్కువ వడ్డీకి రుణాలు పొందవచ్చున్నారు. సొసైటీ అధ్యక్షుడు తాడ్డి రామచంద్రరావు మాట్లాడుతూ సొసైటీ అభివృద్ధి కోసం అనేక రకాల వ్యాపారాలు చేసి విధంగా కృషి చేయాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపిపి సారిక ఈశ్వరరావు, గ్రామ సర్పంచ్ రేగిడి రాంబాబు, డైరెక్టర్ దంతులూరి వెంకట చిట్టి రాజు, వైసిపి సీనియర్ నాయకులు రెడ్డి రాజప్పలనాయుడు, వివిధ పార్టీలకు చెందిన నేతలు సిరిశెట్టి నారాయణరావు, కనిమెరక త్రినాథ్, కలిశెట్టి సూర్యనారాయణ, రెడ్డి రాజగోపాల్ పాల్గొన్నారు.

బిందు తుంపర సేద్యంతో మేలు

శృంగవరపుకోట: బిందు తుంపర సేద్యం చేయడం వల్ల రైతులకు ఎంతో ఆర్థికపరమైన, దిగుబడి పరమైన లాభదాయకాలు ఎక్కువగా వుంటాయని ఎపిఎంఐపి ప్రాజెక్ట్ డైరక్టర్ పిఎన్‌వి లక్ష్మి నారాయణ అన్నారు. శనివారం మండలంలోని సంతగైరమ్మ పేటలో బిందు తుంపర సేద్యం యూనిట్లును ఆయన పరిశీలించారు. ఈ వ్యవసాయం చేస్తున్న చలుమూరి దేముడు, గోగాడ అప్పలనాయుడు క్షేత్రాల్లో వున్న సూక్ష్మ సేద్యంను చూశారు. బిందు తుంపర సేద్యం వల్ల రైతులకు తక్కువ పెట్టుబడి తక్కువ నీరు వల్ల పంటలు బాగా పండుతాయన్నారు. మండలంలో ఇప్పటికీ 24 మంది రైతులు 56 ఎకరాల్లో సాగుచేస్తున్నారని వీరికి రూ. ఐదులక్షల విలువైన పరికరాలను మంజూరు చేశామన్నారు. ఈ బిందు తుంపర సేద్యం మామిడి, మామిడి, సపోటాకు ఉపయోగమన్నారు.

త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలి

ప్రజాశక్తి - గజపతినగరం

త్వరితగతిన ఇళ్ల నిర్మాణం పూర్తి చేయాలని మండల స్పెషల్ ఆఫీసర్ పి.రమేష్ ఆదేశించారు. శనివారం గంగచోళ్లపెంటలో వైయస్సార్ కాలనీని ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామంలో రెండు లేఔట్‌లోను 37 ఇళ్లకు గాను 16 ఇళ్ల నిర్మాణంలో ఉన్నాయని మిగిలిన ఇల్లు కూడా నిర్మాణం చేపట్టాలని, సొంత స్థలాలలో నిర్మిస్తున్న 61 ఇళ్లను కూడా త్వరితగతిని పూర్తి చేయాలని లేదంటే రద్దు చేస్తామని హెచ్చరించారు. లబ్ధిదారులను కలిసి బిల్లుల సమస్యలపై ఆరా తీసారు. పెండింగ్ బిల్లులను వెంటనే చెల్లించాలని, అవసరమైన వాళ్లకి స్త్రీనిధి లోన్లను విడుదల చేయాలని అధికారులను ఆదేశించారు. కార్యక్రమంలో ఎంపిడిఒ పి.సుదర్శనరావు, తహశీల్దార్ ఎం.అరుణకుమారి, హౌసింగ్ డిఇ సత్యనారాయణ, ఎపిఒ సి.హెచ్.రామారావు, గ్రామ పెద్దలు తదితరులు పాల్గొన్నారు.

సఖి గ్రూపులను సద్వినియోగం చేసుకోండి

సఖి గ్రూపులను సద్వినియోగం చేసుకోవాలని మండల ప్రత్యేకాధికారి రమేష్ బాబు అన్నారు. జెడ్‌పి ఉన్నత పాఠశాలలో కిశోర బాలికలకు సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరూ కిషోర్ బాలికల సఖి గ్రూపుల్లో చేరి బంగారు భవిష్యత్తుకు బాటలు వేసుకోవాలని అన్నారు.

నలుగురు ఇంటర్ విద్యార్థులు డిబార్

విజయనగరంటౌన్ : జిల్లాలో శనివారం జరిగిన ఇంటర్ మొదటి సంవత్సరం పరీక్షల్లో మాస్ కాపీయింగ్‌కు పాల్పడిన నలుగురు విద్యార్థులను డిబార్ చేసినట్లు ఆర్‌ఐఒ సత్యనారాయణ తెలిపారు. చీపురుపల్లి, గుర్ల, ఎస్.కోట కేంద్రాల్లో నలుగురు విద్యార్థులు చూసి రాతలకు పాల్పడ్డారని తెలిపారు. మొత్తం విద్యార్థుల్లో 98శాతం మంది పరీక్షకు హాజరయ్యారని తెలిపారు. 44 కేంద్రాలను తనిఖీ బృందాలు పరిశీలించాయని తెలిపారు.